28-08Pg3exHMNWJQE:Layout 1 01/01/01 7:28 AM Page 1

సాహితీ గతి వారం విశేషాలపై సమీక్ష
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
అనంతపురం fb.com/vaartha
PUBLISHED FROM ANANTAPUR, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
28-8-2023 సోమవారం సంపుటి : 29 సంచిక : 209, పేజీలు : 08+4 వెల : 6.50

ముంబయి హోటల్‌లో అగ్నిప్రమాదం, ముగ్గురు సజీవ దహనం

ఇండియా కూటమిలోకి మరికొన్ని పార్టీలు: నితీశ్

5లో

## పారిశ్రామిక రంగంలో
# ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం

### ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ.కోటి వరకు ఇన్సెంటివ్

### నికరపెట్టుబడిలో 45శాతం వరకు,గరిష్టంగా రూ.10లక్షల వరకు రాయితీ



**విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామిక రంగంలో ఎస్సీ,ఎస్టీ వర్గాల వారికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని సిఎం జగన్ స్పష్టం చేసారు. నైపుణ్యరంగాల్లో వారి ప్రతిభకు అనుగుణంగా పారిశ్రామికంగా ఎదిగేందుకు వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నుంచి భారీ పారిశ్రామిక రంగాల్లో ఆసక్తి కన్పర్చేవారికి ప్రత్యేక రాయితీలు, అవసరతకు అనుగుణంగా భూకేటాయింపులు జరుగుతాయని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆయా ప్రాధాన్యతా రంగాలతో పాటు పారిశ్రామిక రంగంలోను అత్యధిక ప్రోత్సాహాన్ని అందిస్తోంది.ఆ దిశలో ఇప్పటికే 50లక్షల కోట్లు వరకు పెట్టుబడులకు పారిశ్రామిక రంగంలో అవకాశం కల్పించింది. ఇదే క్రమంలో ఎస్సీ,ఎస్టీలు పారిశ్రామిక వేత్తలకు సహకారం అందిస్తోంది.సమాచార పౌర సంబంధాలశాఖ, ఇతర ప్రభుత్వరంగశాఖల ద్వారా లభించిన సమాచారాన్ని అనుసరించి పారిశ్రామిక రంగంలో నిపుణత కలిగిన యువతకు అవకాశాలు కల్పించాలని సిఎం జగన్ అభిప్రాయపడుతున్నారు.ఆ దశలో వారికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. సిఎం జగన్ ఆదేశాలను అనుసరించి "జగనన్న వైఎస్సార్ బడుగు వికాసం" పథకం ద్వారా ఎస్సీ,ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు భారీగా ప్రోత్సాహకాలు లభించే విధంగా చర్యలు సంబంధిత విభాగం అధికారికంగా చర్యలు తీసుకుంది. ఈ పథకం ద్వారా 25శాతం చెల్లింపుపై ఇండిస్ట్రీయల్ పార్కులో భూములను అప్పగిస్తారు.75శాతాన్ని 8శాతం నామమాత్రం వడ్డీతో 8 ఏళ్ల కాలంలో చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం అందజేస్తోంది.

ఆ విధంగా నికరపెట్టుబడిలో 45శాతం వరకు, గరిష్టంగా రూ.10లక్షల వరకు రాయితీ ఇస్తారు. మరి కొన్ని ప్రయోజనాలకు కల్పించే బడుగు వికాసం పథకాన్ని తీర్చిదిద్దాలని సిఎం జగన్ అధికారులకు కీలకాదేశాలు ఎప్పటికప్పుడు జారీ చేస్తున్నారు. నైపుణ్యాతాభివృద్ధి రంగాల్లో మంచి ప్రవేశం ఉన్నవారు పరిశ్రమలు పెడితే, మంచి ఉత్పత్తులతో పాటుగా ఆర్థికంగా స్థిరపడటానికి అవకాశాలుంటాయని ముఖ్యంగా అభిప్రాయపడుతున్నారు. గతంలో కేవలం ఎస్సీ, ఎస్టీ రంగాలకు నామ మాత్రపు ప్రోత్సాహాలుండేవని, అప్పటి ప్రభుత్వాలు స్కిల్స్‌కు గుర్తింపు ఇచ్చేవి కావన్నారు. మన ప్రభుత్వం అందుకు భిన్నంగా వారికి అన్ని విధాలుగా అండగాఉంటుందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు సంబంధించి ఇప్పటికే ఎస్సీ,ఎస్టీ వర్గాలకు మనం ప్రాధాన్యతను కల్పిస్తున్నామని సిఎం జగన్ స్పష్టం చేస్తున్నారు.ఈ రంగంలో ఉత్పత్తులకు ప్రభుత్వపరమైన ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఎంఎస్‌ఎంఇలకు పూర్తి ప్రోత్సాహక నిధులను మంజూరు చేసినట్లు వివరించారు.

ప్రతి పరిశ్రమకు తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నామన్నారు. వర్కింగ్ క్యాపిటల్ రుణాలు తక్కువ వడ్డీకి ఇప్పించేందుకు వీలుగా రూ.200కోట్ల కార్పస్ నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆరు నుండి ఎనిమిది శాతం వరకు వడ్డీ రుణాలను అందిస్తామన్నారు.ప్రామాణిక ఖాతాలు నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎంఇలకు

≫2

## తెలుగు భాష ఎంతో
# ఘనం.. పురాతనం



### మన్‌కి బాత్‌లో తెలుగు భాషాదినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** సంస్కృత భాషలా తెలుగు చాలా పురాతనమైన భాష అని ప్రధాని మోడీ మన్‌కీబాత్‌లో పేర్కొన్నారు. ఆయన ఆదివారం ప్రసంగిస్తూ 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. తెలుగువారందరికి ఆయన శుభాక్షాంకలు తెలియజేస్తూ ప్రజలందరు మాతృభాషలను శ్రద్ధగా నేర్చుకోవాలని పేర్కొన్నారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రపంచ సంస్కృత భాషా దినోత్సవ శుభాకాంక్షలు కూడా ఆయన తెలిపారు. 'సంస్కృత భారతి' ఆధ్వర్యంలో సంస్కృతంలో మాట్లాడే క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చంద్రయాన్ 3 భారత్ విజయానికి ఎప్పటికీ ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని మోడీ కొనియాడారు. మన్‌కీబాత్ 104వ ఎపిసోడ్‌లో నేడు ప్రధాని మాట్లాడారు. తెలుగుభాషా దినోత్సవ శుభాకాంక్షలుతెలిపారు. చంద్రయాన్3 ప్రాజెక్టు మహిళా సాధికారతకు చిహ్నంగా నిలిచిందన్నారు. భారత్ వచ్చే నెల ఢిల్లీలో జి 20 సమావేశాలకు సిద్ధమవుతోందని, గతంలో ఎన్నడూ లేని విధంగా సమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరు కానున్నారని వెల్లడించారు. తొలిసారి భారత్ ఈ స్థాయి జి20లో భాగస్వామి అవుతోందని గ్రూపును మరింత కలుపుగోలుగా చేస్తోందని చెప్పారు. జి20కి భారత్ నేతృత్వం అంటే ప్రజలే అధ్యక్షత వహిస్తున్నట్లు భావించాలని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

భారత్ జి 20 అధ్యక్షత స్వీకరించిన నాటి నుంచి గర్వించదగిన పరిణామాలు చాలా చోటుచేసుకొన్నాయి. ఇప్పటివరకు ఈ సదస్సులు జరిగిన నగరాల్లో ప్రజలు విదేశీ అతిథులకు సాదరంగా ఆహ్వానించారు. భారత్‌లోని వైవిధ్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని చూసి విదేశీ అతిథులు చాలా ప్రభావితమయ్యారు. భారత్‌కు చాలా ఉజ్వల భవిష్యత్తు ఉందని వారు తెలుసుకొన్నారు. జి20 సదస్సు శ్రీనగర్‌లో జరిగిన తర్వాత

≫2

## ఆంధ్ర, తెలంగాణలో ఉన్నది
# 'డబుల్' ఇంజినే!

### స్వాతంత్ర్యం వచ్చాక ఏ నిందితుడు ఇన్నిరోజులు బెయిల్‌పై బయట తిరగలేదు

### ఎన్నికలు ఎపుడు వచ్చినా జగన్ ఓటమి ఖాయం-ఎపి ఖజానా దివాళా తీసింది

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు

**అమరావతి, ఆగస్టు 27, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల్లో వైఎస్సార్సీ, బిఆర్ఎస్ ముసుగులో బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే నడుస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర ఆదివారం గుంటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇక్కడి వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బహిరంగసభ నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణ మాట్లాడారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నపుడు వైఎస్సార్సీని గెలిపించి అధికారం మా చేతికివ్వండి.. కేంద్రం మెడలు వంచుతానని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారని అన్నారు.. కేసులకు భయపడి ఇపుడు సిఎం జగన్ ప్రధాని మోడీకి లొంగిపోయారన్నారు.



పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న సిఎం జగన్ బెయిల్‌పై బయట తిరుగుతున్నారని అన్నారు. పేరుకు వైఎస్సార్సీ కానీ, ముసుగులో బిజెపినే అని ఆరోపించారు. మేకవన్నె పులిలాగా వీళ్లకూడ బిజెపికి అనుకూలంగా పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. పైకి మాత్రం వైఎస్సార్సీ నాయకులు లాగా కన్పిస్తున్నారని, అందుకే డబుల్ ఇంజిన్ అనేది ఎపి, తెలంగాణ రెండు రాష్ట్రాలకు పనిచేస్తుందని నారాయణ పేర్కొన్నారు. ఎన్నికలు ఎపుడు వచ్చినా జగన్‌రెడ్డి ఓటమి ఖాయం అన్నారు. వివేకా హత్య జరిగి నాలుగేళ్లు గడుస్తున్నా ఎటూ తేలలేదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి ఇప్పటి వరకు ఏ నిందితుడు ఇన్ని రోజులు బెయిల్‌పై బయట తిరగలేదన్నారు. వైఎస్సార్సీ ప్రభుత్వం పాలనలో రాష్ట్రం దివాళా తీసిందని మండిపడ్డారు. వివేకా హత్యకేసు నేటికీ తేలలేదన్నారు. కడప జిల్లాలో ఏ వైఎస్సార్సీ నాయకుడిని అడిగినా వివేకాను హత్యచేసింది ఎవరనే విషయంతెలుస్తుందని అసహనం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందని, అప్పులపాలైపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.. చివరికి సిఎం సమావేశానికి కలెక్టర్ నిధులు ఇస్తున్నారంటే..పరిస్థితి అర్ధం చేసుకోవచ్చని అన్నారు. రాష్ట్ర ఖజానా దివాళా తీసిందన్నారు. అందుకే రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి..అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్సీ ప్రభుత్వాన్ని, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పోరాడతామని ధీమా వ్యక్తంచేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విక్రమ్ ల్యాండర్‌లోని క్యాస్టే పరికరం

# చంద్రునిపై ఉష్ణోగ్రతలు..

### దక్షిణ ధ్రువంవద్ద వాతావరణ పరిస్థితిపై సమాచారం పంపిన 'విక్రమ్'

**శ్రీహరికోట (తడ), ఆగస్టు 27 ప్రభాతవార్త:** జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగిన చంద్రయాన్-3లో ప్రయోగించిన విక్రమ్ ల్యాండర్ తన మూడు ఉపకరాలలోని ఒక దాని పరిశీలన ప్రారంభించింది. విక్రమ్‌లో మూడు, ప్రజ్ఞాన్ రోవర్‌లో రెండు ఉపకరణాలు ప్రవేశపెట్టి పంపించారు. అందులో ఇప్పటికే ప్రజ్ఞాన్ రోవర్ పంపించిన ఫొటోలు ఇస్రోకు అందాయి. ప్రస్తుతం విక్రమ్ ల్యాండర్‌లోని చంద్రుని యొక్క ఉపరితల థర్మోఫిజికల్ ప్రయోగం జరిపే క్యాస్టే ఆదివారం భూకేంద్రాలకు ఎంతో విలువైన సమాచారం అందించింది. చంద్రుని ఉపరితలం మీద ఉష్ణోగ్రతల మార్పులు, చేర్పులను ఈ పరికరం కొలుస్తోంది. చంద్రునిపై ఉన్న వాతావరణం, మట్టి వంటి వాటిని కూడా అధ్యయనం చేస్తూ ఉంది. మార్పు చేర్పులను

≫2

# అప్పుడు వెయ్యి, ఇప్పుడు 5 వేలు

### అందకుండా పోతున్న ఇసుక

### కోర్టులు నిషేధం విధించినా ఆగని అక్రమ తవ్వకాలు

### అనధికారికంగా 500 రీచ్‌ల్లో రూ.40 కోట్ల విలువైన ఇసుక అక్రమ రవాణా

### మంత్రి 'పెద్దిరెడ్డి'కి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్‌బాబు బహిరంగ లేఖ



**అమరావతి, ఆగస్టు 27, ప్రభాతవార్త ప్రతినిధి:** తాజాగా టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక అక్రమాలపై ఇచ్చిన ప్రజెంటేషన్‌కు సమాధానం చెప్పకుండా ఎదురుదాడి చేయటం మంత్రిగా మీకు తగునా అంటూ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు బహిరంగ లేఖ రాశారు..తాముఅడిగే ప్రశ్నలపై రాష్ట్రప్రజానీకానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి పాలనలో చంద్రబాబు ఇంటి పక్కన ఇసుక దోపిడీ జరిగిందన్న మీ ఆరోపణ పచ్చిఅబద్ధం కాదా? అనిప్రశ్నించారు.. చంద్రబాబు ఇంటి పక్కన అమరావతి నిర్మాణాలకు నీటిపారుదలశాఖ చేసిన డ్రెడ్జింగ్‌లో వచ్చిన ఇసుకను వాడుకుంటే ప్రతిపక్షంలో ఉన్న మీరు వక్రీకరించి అబద్ధపు ప్రచారంచేశారన్నారు.. మీరు అధికారానికి వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారమే డ్రెడ్జింగ్ చేశారని, ఎన్‌జిటిలో జగన్‌రెడ్డి ప్రభుత్వం అఫిడవిట్ వేసి జరిమానా రద్దుచేసుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎన్‌జిటిలోమీ ప్రభుత్వం వేసిన అఫిడవిట్‌కు విరుద్ధంగా ఇపుడు మళ్లీ పాతఅబద్ధమే చెప్పటం మోసంకాదా? అని ప్రశ్నించారు.. పశ్చిమ గోదావరి జిల్లా ఇసుక రీచ్‌లను నిర్వహిస్తున్న మహిళా సంఘాలపైకి కృష్ణాజిల్లా తహశీల్దార్ వనజాక్షి వెళ్లి దౌర్జన్యం చేయటం అధికార దుర్వినియోగం కాదా? అని అన్నారు.. మహిళా సంఘాలకు, వనజాక్షికి మధ్య జరిగిన గొడవను చింతమనేనిపైకి నెట్టి చప్పిన అబద్ధమే వందసార్లు చెప్పటం నీచరాజకీయం కాదా?అని దుయ్యబట్టారు.. టిడిపి పాలనలో రూ.1000కి వచ్చే ట్రాక్టర్ ఇసుక నేడు రూ.5వేలుకుపెరగటం మీదోపిడీ పాపంకాదా? అని ప్రశ్నించారు.. వైకుంఠపురంరీచ్‌లో అనుమతికి మించి రెట్టింపు పైగా ఇసుక తవ్వారని కోర్టు కమిషన్ నిర్ధారించిందని, ఇది వాస్తవం కాదా అని అన్నారు. అనుమతుల మేరకే ఇసుక తవ్వకాలు చేశామనే మీ ప్రకటన పచ్చి అబద్ధం కాదాఅని సూటిగా ప్రశ్నించారు. అనధికారికంగా 500 రీచ్‌ల్లో 40 కోట్ల టన్నుల ఇసుక తవ్వి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు అక్రమంగా తరలించి రూ.40వేల కోట్ల దోపిడీ చేసింది జగన్‌రెడ్డి, పెద్దిరెడ్డి, జేగ్యాంగ్ కాదా?అని అన్నారు.. ఇసుక తవ్వకాలపై ప్రస్తుతం కోర్టులు నిషేధం విధించి ఉన్నా, ధిక్కరించి ఇసుక తవ్వి కొండలు, కొండలు నిల్వ చేసి అక్రమ బిల్లులతో అమ్ముకుంటుంది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. సిఎం ఇంటి సమీపంలో గుండుమేడకు ఈసి లేకున్నా అక్కడ లక్షలాది టన్నుల ఇసుక కొండను నిల్వచేయటం నిబంధనల ఉల్లంఘన కాదా అని అన్నారు. ఇసుక మాఫియాపై ప్రశ్నించిన దళిత యువకుడు వరప్రసాద్‌కు రాజమహేంద్రవరంలో పోలీసుస్టేషన్‌లో గుండు కొట్టించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ దారుణంపై రాష్ట్రపతి స్పందించినా మీరు, మీ సిఎం ఎందుకు స్పందించలేదని ఆనంద్ బాబు లేఖలో ప్రశ్నించారు.

## ఇసుక దోపిడీపై 3 రోజులపాటు టిడిపి నిరసనలు


**అమరావతి, ఆగస్టు 27,ప్రభాతవార్త ప్రతినిధి:** టెండర్లు పిలవకుండా కొత్త ఏజెన్సీ ఎంపిక చేయకుండా, ఎన్‌జిటి విధించిన నిషేదాజ్ఞలను పట్టించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రంలో యధేచ్ఛగా జరుగుతున్న ఇసుక అక్రమమైనింగ్‌ను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 28,29,30 తేదీల్లో నిరసనలు చేపట్టనున్నట్టు టిడిపి ప్రకటించింది. ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసుకుని అధిక ధరలకు ఇసుకను వైఎస్సార్సీ నాయకులు అమ్ముకుంటున్నారని టిడిసి విమర్శించింది.. ఈమేరకు టిడిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలకు పార్టీ పిలుపునిచ్చింది. తొలిరోజు అయిన ఈనెల 28న వైఎస్సార్సీ నాయకులు అక్రమంగా మైనింగ్ చేస్తున్న ఇసుక రీచ్‌లను, అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపింగ్‌యార్డుల వద్ద పార్టీశ్రేణులు, ఆయా గ్రామస్థులతో కలిసి నిరసనలు చేపడతారని పార్టీ పేర్కొంది.. అనంతరం ఇసుక అక్రమ దోపిడీపై ఆధారాలతోకూడిన వివరాలను ప్రజలకు తెలియజేస్తారన్నారు.. రెండో రోజు 29న ఇసుక అక్రమ దోపిడీకి సంబంధించిన వివరాలను సాక్ష్యాధారాలతో తహశీల్దార్, పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయటం జరుగుతుందని తెలిపారు. మూడవ రోజు 30వ తేదీన అన్ని నియోజకవర్గ నాయకులందరూ విజయవాడ ఇబ్రహీంపట్నంలోఉన్న డిఎంజి (డిపార్ట్‌మెంట్ఆఫ్ మైన్స్, జియాలజీ) ప్రధాన కార్యాలయం ముట్టడిచేసి నిరసన తెలియజేస్తామని, వైఎస్సార్సీ చేస్తున్న ఇసుక దోపిడీ గురించి సేకరించిన ఆధారాలతో డిఎంజి డైరెక్టర్‌కు చూపించి వైఎస్సార్సీ ప్రభుత్వం చేస్తున్న ఇసుక దోపిడీని అరికట్టాలని కోరుతామన్నారు.

## టీచర్లు మతప్రచారం చేస్తే
# కఠిన చర్యలు

### - బాలల హక్కుల పరిరక్షణ సంస్థ

**విజయవాడ,ఆగస్టు27,ప్రభాతవార్త ప్రతినిధి:** ఉపాధ్యాయులు మత ప్రచారానికి దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు హెచ్చరించారు. మీడియాకు విడుదలచేసిన ప్రకటనలో ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల మత మనోభావాలు వారి ఆలోచన విధానాలకు సంబంధించినవన్నారు. వాటి విషయం తమకు అనసరమన్నారు.అయితే ఉపాధ్యాయులు మత ప్రచారం, కుల ప్రస్తావనలు తీసుకొస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు.ఇటీవల కొన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులు మత ప్రచారాలు చేస్తున్నట్లు కమిషన్ దృష్టికివచ్చిందన్నారు.మత సంబంధిత ప్రచారాలు, బోధనలు చేయకూడదన్నారు. హిందు, క్రైస్తవం, ముస్లిం, జైన్,సిక్కు మొదలైన ఏ విధమైన మతాలను పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో బోధించడం చేయకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేసారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, వసతి గృహాలు, పునరావాస కేంద్రాల్లో తప్పనిసరిగా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిందేనని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులకు నైతిక విలువలు, నీతి, న్యాయం, సేవాగుణం వంటివి నేర్పించాలన్నారు. విద్యార్థులు సున్నిత మనసత్వం కలిగి ఉంటారన్నారు. వారి మనస్సుల్లో కుల,మత, వర్గ బేధాలు బోధించడం చేయకూడదన్నారు.పలు ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన ఉపాధ్యాయులు, అధ్యాపకలు వృత్తి, విధి, విధానాలకు భిన్నంగా మత బోధనలకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. కనీస అనుమతులు లేకుండా ప్రచార సభలు, ప్రార్ధనాలయాలు నిర్వహిస్తున్నరంటూ అభియోగాలున్నాయి. ఇతరమతాల మనోభావాలను ఇబ్బంది పెట్టే రీతిలో వ్యాఖ్యానాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సున్నిత పరిస్థితులకు వీరు ఆస్కారమిస్తున్నారనే ఆరోపణల నడుమ బాలల హక్కు పరిరక్షణ కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈఅంశంపై అన్నిపాఠశాలలకు విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

# ఎన్టీఆర్ చిత్రంతో రూ. 100 వెండి నాణెం



### నేడు ఆవిష్కరించనున్న రాష్ట్రపతి ముర్ము

**విజయవాడ.ఆగస్టు27,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగువారి కీర్తి ప్రతిష్టలను విశ్వమంతటా చాటిన మేరు నటదీరుడు, రాజకీయ సుయోధనుడు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు స్మారకార్థం కేంద్ర ప్రభుత్వం ఆయన పేరిట రూ.100 వెండి నాణేంను ఏర్పాటు చేసింది.ఈ విశిష్ట నాణెంను ఈ నెల 28సోమవారం ఉదయం రాష్ట్రపతి భవనంలో ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ద్రౌపది ముర్మూ ఆవిష్కరిస్తున్నారు.బహుశా ఇంతటి ఖ్యాతిని పొందిన తొలి తెలుగు ముఖ్యమంత్రి ఎన్టీఆర్, రాజకీయాల్లో ఆయనదో ఫంథా. 1982లో తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసి, ఆనాటిప్రధాని ఇందిరాగాంధీ చరిష్మాను తట్టుకుని 9నెలల వ్యవధిలో 1983 నాటికి తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారు.పదవి చేపట్టిన ఏడాది అయ్యి అవ్వక ముందే నాదెండ్ల భాస్కరరావు ఎత్తుగడలో భాగంగా పదవి కొల్పోయారు.

అయితే నెల రోజుల లోపలే ప్రజా మద్దతులో తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. 1989లో ఆయన స్వయంగా హిందుపూర్‌లో ఓడిపోవడంతో పాటు మొత్తం టిడిపి పరాజితమైంది. ప్రతిపక్షనేతగా అయిదేళ్లపాటు సభలో అడుగుపెట్టకుండానే,ఆయన తన రాజకీయ దురంధరత చాటారు.1994లో 220కిపై సీట్లు సాధించి తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు.అయితే పార్టీలో అంతర్గత పోరు కారణంగా 1995నాటికి ఆయన పదవిని కోల్పోయారు.ఈ

≫2

28-08Pg6exHMNWJQE:Layout 1 01/01/01 7:30 AM Page 1





## భక్తులకు సేవచేసే భాగ్యం పూర్వజన్మ సుకృతం

### టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులుగా ముగ్గురుప్రమాణ స్వీకారం

**తిరుమల,ఆగస్టు27ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం లక్షలమంది భక్తులు దేవదేవుని దర్శనానికి తిరుమలకు వస్తున్నారని, వారందరికీ మెరుగైన సేవలందించే భాగ్యం కలగడం తమ పూర్వజన్మసుకృతమని పలువురు ధర్మకర్తలమండలి సభ్యులు తెలిపారు.నూతనంగా ఏర్పాటైన 53వ టిటిడి ధర్మకర్తలమండలి సభ్యుల్లో ఆదివారం ముగ్గురు సభ్యులు తుడచైర్మన్ చెవిరెడ్డి మోహిత్ ఎక్స్అఫీషియో సభ్యుడిగా,సుదర్శన్ వేణు, నెరుసు నాగసత్యం దేవుని చెంత సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. నలుగురు ఎక్స్అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం 28 మందితో టిటిడి బోర్డు ఏర్పాటైన విషయం విదితమే. స్వామివారి సన్నిధిలో ఆదివారం టిటిడి జెఇఒ వీరబ్రహ్మం వారితో ప్రమాణస్వీకారం చేయించారు. స్వామివారి దర్శనాంతరం బోర్డుసభ్యులకు రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు,చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఇఒలు లోకనాథం, గోవిందరాజన్,హారీంద్రనాథ్ పాల్గొన్నారు.



## పురుషోత్తమునికి పవిత్రోత్సవాలు ఆరంభం

**తిరుమల,ఆగస్టు27 ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు జరిపించుకునే ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఉదయం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు.అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.వేదపండితులు పంచసూక్తులను పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్టజరిగింది. మధ్యాహ్నం స్వామి ,అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. సాయంత్రం నాలుగుమాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలోవైదిక కార్యక్రమాలు జరిగాయి. ఈ పవిత్రోత్సవాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి,టిటిడి ఇఒ ధర్మారెడ్డి దంపతులు,ఆలయ డిప్యూటీ ఇఒలోకనాథం ,ఆలయ పేష్కార్ శ్రీహరి,అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.ఈ సదర్భంగా ఆలయంలో కల్యాణోత్సవం ,ఊంజల్‌సేవ,ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంరణ సేవలను టిటిడి మూడురోజులు రద్దు చేసింది.

## సెప్టెంబర్ 7న కృష్ణాష్టమి వేడుకలు



**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో సెప్టెంబర్7వతేదీ గురువారం గోకులాష్టమి పర్వదినాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఆలయంలో ప్రత్యేకంగా ఆస్థానం నిర్వహించి, గోగర్భంవద్ద ఉన్న కాళీయమర్ధనుడికి విశేష అభిషేకాలు జరిపిస్తారు. అనంతరం ఆలయ మాఢవీధుల్లో ఉట్లను ఏర్పాటుచేసి ఉట్టి కొట్టేందుకు యువత భాగస్వాములవుతారు. రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామి పల్లకిలో వేంచేసి ఈ ఉత్సవాన్ని తిలకిస్తారు. అలాగే తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణస్వామి ఆల యంలో వచ్చేనెల 7న గోకులాష్టమి పర్వదినాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిం చను న్నారు. ఈ సందర్భంగా స్వామివారు పెద్దశేషవాహనంపై ఆలయమాడ వీధుల్లో విహరించి కటాక్షించను న్నారు. అనంతరం గోపూజ,గోకులాష్టమి ఆస్థానం నిర్వహి స్తారు.అలాగే 8న ఉట్లోత్సవంను పురస్కరించకుని మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4గంటల వరకు స్నపన తిరుమంజనం,తరువాత ఊంజల్‌సేవ జరుగనుంది.సాయంత్రం 6.15నుంచి రాత్రి 7.30వరకు స్వామివారికి ఉట్లోత్సవం,ఆస్థానం నిర్వహిస్తారు.



## తిరుమలలో విశ్రాంత జస్టిస్ రమణ

**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ దంపతులు తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం జస్టిస్ రమణ దంపతులు తిరుపతికి చేరుకోవడంతో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం కరుణాకర్‌రెడ్డి ఇంటికి చేరుకుని కాసేపు ముచ్చటించారు. టిటిడి ఛైర్మన్‌గా మరింత దార్మికప్రచారానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. వారితోబాటు తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి కెఎస్ శ్రీనివాస రాజు ఉన్నారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేసిన సిఎం

### పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందుల్లో ఉద్యోగులు: రేపల్లె టిడిపి ఎమ్మెల్యే అనగాని



**అమరావతి, ఆగస్టు 27, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోకాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నమ్మించి గొంతుకోశారని బాపట్ల జిల్లా రేపల్లె తెదేపా ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఎన్నికలకు ముందు అందర్నీ రెగ్యులర్ చేస్తామని అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. 2016 జూన్ నాటికి ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారిని మాత్రమే రెగ్యులర్ చేస్తామనటం మోసంకాదా? అని ప్రశ్నించారు.ప్రభుత్వ నిర్ణయంతో మూడు లక్షలకు పైగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు, కరెంటు చార్జీలు, రవాణా చార్జీలతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జగన్‌రెడ్డి ఇప్పటికైనా మోసగించే ధోరణిని మార్చుకుని అందరినీ రెగ్యులర్ చేయాలని అన్నారు.

## మంచి పనులు ఆపలేను,విమర్శలకు వెరవను

### మూడుతరాల మనిషి పుస్తకావిష్కరణ సభలో టిటిడి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి, ఇఒ ధర్మారెడ్డి

**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో ధర్మకర్తలమండలి ఛైర్మన్‌గా గాకుండా దేవుని చెంత సేవకుడిగా, భక్తుల్లో భక్తుడిగా తనదైన శైలిలో సేవలందించేందుకు ముందుంటానని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఉద్ఘాటించారు. మంచిపనులు చేయడానికి ఎప్పుడూ విమర్శలను ఖాతరుచేయబోనన్నారు. విమర్శలకు భయపడేదిలేదని స్పష్టం చేశారు. క్రిస్టియన్ అని ముద్రవేసి నాస్తికుడని అనుచితమైన ఆరోపణలకు,విమర్శలకు భయపడేతత్వంకాదని, వాటికి ధీటుగాసమాధానం చెప్పేవాడినని కరుణాకర్ రెడ్డి నొక్కివక్కాణిచారు. ఆదివారం తిరుపతిలో జరిగిన మూడు తరాల మనిషి పుస్తకావిష్కరణ సభలో ఆయన పాల్గొని విమర్శకులకు ఘాటుగా సమధానం చెప్పారు. గత 17 సంవత్సరాల క్రితమే టిటిడి ఛైర్మన్‌గా పదవిచేపట్టానని, ఆ దేవదేవుడి దయతో మతాంతీకరణలు ఆపడానికి 30వేల మందికి కళ్యాణమస్తు ద్వారా సామూహిక వివాహాలు చేయించానని తెలిపారు. అంతేగాక తిరుమల ఆలయ మాడవీధుల్లో చెప్పులు ధరించి తిరుగడం నిషేధం అమలుచేసేలా చూడటంలో తన వంతు కీలకబాధ్యతలు వహించానన్నారు. అన్నమయ్య 600 వర్ధంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం, దళిత వాడలకు శ్రీవేంకటేశ్వరస్వామిని తీసుకెళ్ళి కళ్యాణం చేయించడం వంటివి నా ద్వారానే సాధ్యమయ్యాయని వివరించారు. అప్పట్లో ఛైర్మన్‌గా ఉన్నప్పుడు పలు సంస్కరణలు తీసుకొచ్చానని ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా భాధ్యతను నిర్వహించానని చెప్పారు.అయితే ఇవన్నీ కూడా నన్ను విమర్శించేవారికి కనపడకపోవడం వారి దురదృష్టమని అన్నారు. వీరి ఆరోపణలకు భయపడి మంచి పనులు చేయడం ఆపనని పోరాటాల నుండి పైకి వచ్చిన వాడికి ఇలాంటి వాటికి భయపడనని పేర్కొన్నారు.



**నాలుగేళ్లలో అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రదర్శన :ఇఒ ధర్మారెడ్డి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిపై ఉన్న భక్తివిశ్వాసాలను దెబ్బతీసేలా సోషల్‌మీడియాలో కొందరు దుష్ప్రచారం చేస్తుడటం భాదాకరమని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఇందులో తిరుమల వాసులు కూడా ఉండటం గమనార్హం.తిరుపతి తిరుమల రెండు కన్నుల లాంటివని వాటిని నగర ప్రజలు విడివిడిగా చూడరాదని కోరారు. శ్రీవారి దయ వల్లే తిరుపతిలో ప్రత్యక్షంగా,పరోక్షంగా వేలమంది ఉపాధి పొందుతున్నారని ,దేవదేవుడి కరుణతోనే నగరం ఎంతో అభివృద్ధి సాధిస్తోందని వివరించారు. టిటిడి నాలుగేళ్ళలో చేసిన అభివృద్ధి,భక్తుల వసతుల కల్పనపై రానున్న నెలరోజుల్లో మహతి ఆడిటోరియంలో పవర్‌పాయింట్ ప్రదర్శన ఏర్పాటుచేసి వివరిస్తామని ఇఒ చెప్పారు.

## మహిళాశక్తికి తోడుగా టిడిపి మహాశక్తి పథకం

### క్షతగాత్రులను ఆదుకుంటూ మానవత్వం ప్రదర్శించిన మాజీ ఎంఎల్‌ఏ రాజగోపాల్

**జగ్గయ్యపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త :** మహిళాశక్తికి తోడుగా టిడిపి మహాశక్తి పథకం ఉంటుందని, అధికారంలోకి రావటంతోనే ప్రతి ఒక్కరి సంక్షేమం తమ బాధ్యతగా చంద్రబాబునాయుడు పరిపాలన ఉంటుందని టిడిపి జాతీయ కోశాధికారి, మాజీఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపే పట్టణంలోని 9వ వార్డులో ఆదివారం కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న రాజగోపాల్ ఇంటింటికి తిరిగి జగన్మోహనరెడ్డి ప్రజావ్యతిరేక విధానాల గురించి, చంద్రబాబు పరిపాలనాదక్షత గురించి అవగాహన కలిగించారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిందేనని రాబోవు రోజుల్లో యువతకు, రైతులకు, మహిళలకు, విద్యార్థినీ-విద్యార్థులకు, నిరుపేదలకు, కార్మిక-శ్రామికులకు మేలు జరుగాల్సివుందని ఇందుకు తెలుగుదేశం పార్టీ భవిష్యత్ గ్యారెంటీ ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ, ఎస్‌ఆర్‌సిసి యూత్ సభ్యులు, పేరం సైదేశ్వరరావు, నకరికంటి వెంకట్, కర్ల జోజి, గుంజ నరసయ్య, కేళీ నాగేశ్వరరావు, షేక్ సత్తార్, వేదులాపురి సైదేశ్వరరావు, కె సైదులు, మొగిలి శ్రీనివాసరావు, చిలుకూరి కార్తీక్, గడ్డం రాంబాబు, కొత్త నాగరాజు, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

**జగ్గయ్యపేట ప్రథమ మున్సిపల్ ఛైర్మన్ బదరినారాయణ జన్మదిన వేడుక:** జగ్గయ్యపేట పురపాలక సంఘ తొలి ఛైర్మన్ శ్రీరాం బదరినారాయణ పుట్టినరోజు వేడుకను ఆదివారం ఆయన సోదరులు, టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. పేద విద్యార్థుల చదువుకోసం ఎందరికో ఆర్థికసాయం అందించిన, జగ్గయ్యపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్పనాయకుడు బదరినారాయణ అంటూ పలువురు శ్లాఘించారు. కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో రేపాల మోహనరావు, శ్రీరాం ధనుంజయ, శ్రీరాం సాయిప్రసాదు, నూకల కుమారరాజ, మైనేని రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటి పర్యటనలో టిడిపి జాతీయ కోశాధికారి, మాజీఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, టిడిపి నాయకులు

**మానవత్వం ప్రదర్శించిన మాజీ ఎంఎల్‌ఏ రాజగోపాల్:** విజయవాడ మార్గం నుండి జగ్గయ్యపేటకు విచ్చేస్తున్న శ్రీరాం రాజగోపాల్ ఇబ్రహీంపట్నం వద్ద రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో యువకులు రోడ్డుపై పడి రక్తం ఒడ్డుతున్న పరిస్థితులను ప్రత్యక్షంగా గమనించి వెంటనే తన వద్దగల ప్రథమ చికిత్స కిట్‌తో స్థానికుల సహకారంతో వారికి అత్యవసర ప్రథమచికిత్స అందించారు. రక్తస్రావాన్ని నివారించి వారిని వెంటనే విజయవాడ ఆసుపత్రికి తరలింపజేశారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి తిరిగి జగ్గయ్యపేట వస్తున్న సందర్భంలో తనకళ్ళముందే జరిగిన ప్రమాదాన్నిగమనించి మానవత్వం ప్రదర్శించారు. రాజగోపాల్ ఏర్పాటుచేసిన ప్రథమ చికిత్సకిట్ ద్వారా రక్తస్రావాన్ని అరికట్టి యువకుడిని ప్రాణాపాయ స్థితినుండి కాపాడారు. ఈసందర్భంగా క్షతగాత్రులతో పాటు ఆప్రాంత వాసులు రాజగోపాల్‌ను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎండియు ఆపరేటర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

### ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడిచేటి కిషోర్ కుమార్

**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 27 ప్రభాతవార్త:** ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండియు) ఆపరేటర్లు అనేక రకాలుగా సమస్యలు ఎదుర్కొంటున్నారని,వాటిని ప్రభుత్వం త్వరతిగతిన పరిష్కరించాలని ఎండియు ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడిచేటి కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు.ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పని ఒత్తిడి తట్టుకోలేక ఎండియు ఆపరేటర్లు అనారోగ్యం బారిన పడుతూ కొందరు, ఆత్మహత్యలు చేసుకుని కొందరు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.రెండు సార్లు వేలిముద్రల వలన,అలాగే హెల్పర్ల సమస్యతో ఆపరేటర్లు విలవిలలాడుతున్నా..15 వందల నుండి 2 వేల కుటుంబాలకు సేవ చేస్తున్న ఎండియు ఆపరేటర్ల కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయని వాపోయారు.కరోనా సమయంలో ప్రజలకు సేవ చేస్తూ మృత్యువాత పడిన 62 కుటుంబాలకు ఇంతవరకు ప్రమాద బీమా అందలేదన్నారు.నిన్న మొన్న వచ్చిన సచివాలయ కన్వీనర్లు,గృహ సారథులకు 10 లక్షల బీమా ప్రకటించిన ప్రభుత్వం. ఎండియులకు కూడా అదేవిధంగా వర్తింపచేయాలన్నారు.తాము ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న సమయంలో మే,జూన్ నెలలకు సంబంధించి ప్రతి కార్డుదారుని వద్ద రెండుసార్లు వేలి ముద్రలు తీసుకోవడం,రెండు సార్లు తూకం వేయడం వల్ల,అలాగే సర్వర్లు మొరాయించినా గత 30 నెలలుగా నిత్యవసర సరుకులను ఇంటింటికీ అందించిన ఎండియులపై ప్రభుత్వానికి మంచి అభిప్రాయం ఏర్పడిందన్నారు.అయితే జూలై,ఆగస్టు నెలలకు సంబంధించి అదే సమస్యలు తలెత్తడంతో రేషన్ పంపిణీ ఆలస్యం కావడంతో చాలా మంది కార్డుదారులకు



రేషన్ సరుకులను అందించలేకపోయామన్నారు. దీంతో ఎండియులు,హెల్పర్లపై ప్రజలు దాడులకు దిగుతూ నానా దుర్భాషలా డుతున్నారని బాధపడ్డారు.హెల్పర్లకు ఇచ్చే జీతం కాకుండా అధనంగా 7 వేల నుండి 9 వేల వరకు ఇస్తున్నామన్నారు.రెండు వేలి ముద్రలు,హెల్పర్ల సమస్య కారణంగా పంపిణీ 20వ తేదీ అయినా పూర్తి కావడంలేదన్నారు.హెల్పర్లు అధనంగా 7 వేల రూ॥ల కూలీ అడుగుతున్నారు.ఈ భారం భరించే స్థితిలో ఎండియు ఆపరేటర్లు లేరని,అందుకే రాజీనామా బాట పడుతున్నారని విచారం వ్యక్తంచేశారు.కావున ఒకే వేలిముద్రలో అన్నీ వచ్చే విధంగా చేయాలని,లేని పక్షంవలో సెప్టెంబర్ 1 నుండి మూకుమ్మడిగా తమ విధులను బహిష్కరిస్తామని తెలిపారు.జగనన్న గోరుముద్ద,అంగన్వాడీ కేంద్రాలకు రేషన్ బండ్ల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నందుకు బస్తాకు 10 రూ॥లు ఇస్తున్నారు.అది ఏమాత్రం పెట్రోల్ ఖర్చులకు కూడా సరిపోవడం లేదన్నారు.అలాకాక డీలర్లకు ఇచ్చే విధంగా కేజీకి 1 రూ॥ వంతున చెల్లించాలన్నారు.పెరిగిన పెట్రోల్,నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా తమకు జీతాలు పెంచాలని,హెల్త్ కార్డులు ఇవ్వాలని,2021 నుండి పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణం విడుదల చేయాలన్నారు.

## భక్తుల మనోభావాలను కించపరిచేలా పాలకమండలి నియామకం

### సిఎం సామాజికవర్గం నుండి ఏడుగురు సభ్యులా?

### టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహాయాదవ్ ధ్వజం

**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 27 ప్రభాతవార్త:** ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం యొక్క పాలకమండలిలలో సభ్యులుగా ఉన్నతమైన వ్యక్తులుగా ఉంటూ ఆధ్యాత్మిక చింతన కలిగిన వారిని నియమించాలి.అలాంటిది కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను కించపరిచేలా నేరస్తులను,వ్యాపరవేత్తలను,దైవ చింతన లేని వారిని ప్రభుత్వం పాలకమండలి సభ్యులగా నియమించడం దారుణమని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి.నరసింహాయాదవ్ అన్నారు.ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సిఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తిరుమల పవిత్రతను ఏ విధంగా పరిరక్షించాలి,సామాన్య భక్తులకు ఏ విధంగా పెద్దపీఠ వేయాలి,లేదా టిటిడి బోర్డు నియామకంలో ఎలాంటి పద్ధతులు పాటించాలి అన్న విషయంపై ఆయనకు ఎలాంటి అవగాహన లేదనడానికి తాజాగా 24 మందిని పాలకమండలి సభ్యులుగా నియమించడంతో అర్థమయిందన్నారు.గతంలో 81 మందితో జంబో పాలకమండలిని ఈ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే,కొందరు దీనిపై కోర్టుకు వెళ్లగా



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహాయాదవ్

అందులో 56 మందికి పైగా ప్రత్యేక ఆహ్వానితులను ధర్మాసనం రద్దు చేసింది.ప్రస్తుత నూతన పాలకమండలిలో ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో 7వ నిందితుడిగా ఉండి అప్రూవర్‌గా మారిన శరత్‌చంద్రారెడ్డి అనే వ్యక్తిని బోర్డు సభ్యుడిగా నియమించడం దేనికి సంకేతమన్నారు.రాష్ట్ర జనాభాలో 74 శాతమున్న ఎస్సీ,ఎస్టీ,బిసి సామాజికవర్గాల నుండి ఆరుగురికి అవకాశమిస్తే,5 శాతం ఉన్న సిఎం సొంత సామాజికవర్గం నుండి ఏడుగురికి అవకాశమిచ్చారని మండిపడ్డారు. ఈ పాలకమండలిలో మొత్తం బడా పారిశ్రా మికవేత్తలు,ఆర్థిక ఉగ్రవాదులు,నేర చరితులు ఉన్నారు తప్ప,ఒక్కరు కూడా ఆధ్యాత్మిక భావన,దేవునిపై విశ్వాసం ఉన్నవారు ఒక్కరు కూడా లేరన్నారు.

సమావేశంలో నేతలు ఆర్సీ.మునికృష్ణ,ఊకా విజయ్‌కుమార్,చినబాబు, యశ్వంత్‌రెడ్డి, చెంబకూరు రాజయ్య, మనోహరాచారి, చిన్నా రాయల్, నాగప్రతాప్, గంధంబాబు, శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో వారాంతపురద్దీ

### పెరిగిన రాహుకేతుపూజలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం వారాంతపురద్దీ చోటు చేసుకుంది. వరుస సెలవు కావటంతో రద్దీ పెరుగుతుంది. ఆదివారం భోళాశంకరుని సన్నిధిలో అతిథుల తాకిడి పెరిగింది.ఈ నేపథ్యంలో పూజలు చేయించుకునే భక్తులు ఇబ్బంది పడకుండా ఇఒ వికె సాగర్‌బాబు ఉదయంనుంచి ఆలయంలోని రాహుకేతుదోష పూజలు నిర్వహించే మండపాల్లో పరిశీలనలు జరిపారు. భక్తుల నుంచి పూజలు జరిపి ఎలాంటి సంభావనలు తీసుకోరాదని బలవంతపు వసూళ్ళు ఉండకూడదని హెచ్చరించారు. అధికారులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్న దళారిలవ్యవస్థ మారటం లేదు. అయినా తమ వంతు బాధ్యతగా అధికారులు పరిశీలనలు జరుపుతున్నారు. భక్తుల భద్రతపై దృష్టి సారిస్తున్నారు.ఉదయంనుంచి ఇఒ రద్దీఎక్కువగా ఉంటే రూ.500లు, రూ.750,రూ.1500 మండపాల్లోనే తిష్టవేసి పర్యవేక్షించారు.రాహుకేతుదోష నివారణపూజలు4వేలుజరిగినట్లు దేవస్థానం సమాచారంలో పేర్కొన్నారు.

**పెరుగుతున్న రాహుకేతు పూజలు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం దేవస్థానం అందించిన సమాచారం మేరకు 21వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ప్రకటించారు. కాగా రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500ల టిక్కెట్లతో 2375 మంది, రూ.750 టటిక్కెట్లతో 1094 మంది, రూ.1500టిక్కెట్లతో 233 మంది, రూ.2500 టిక్కెట్లతో ఆలయం లోపల 209 మంది, రూ.5వేల టిక్కెట్లతో 57 మంది పూజలు జరిపించుకున్నారు. ఇక అభిషేకాలు 78 మంది జరిపించుకోగా 23 మంది మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించుకోగా శనీశ్వర అభిషేకాలు 9 జరిపించుకోగా ప్రసాదాలు సుమారు 21వేలు జరిగినట్లు సమాచారం.అయితే శ్రావణ మాసం కావటంతో భక్తుల తాకిడి పరిమితంగా ఉంది. దాంతో వచ్చిన భక్తులు సత్వరంగా సుదర్శనం చేసుకుంటున్నారు.



ఆదివారం విజయవాడ విమానాశ్రయంలో అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న రాష్ట్రమంత్రి తానేటి వనిత

## కేంద్ర హోంమంత్రికి విజయవాడ విమానాశ్రయంలో ఘన స్వాగతం

**విజయవాడ,ఆగస్టు27,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు విజయవాడ విమానాశ్రయం(గన్నవరం)లో ఆదివారం ఘన స్వాగతం లభించింది. ఆదివారం మధ్యాహం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడకు చేరుకున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీ హోంశాఖ మంత్రి తానేటి వనిత పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. అమిత్‌షా ఆమెతో కొద్దిసేపు ముచ్చటించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ గురించి,ఇతర వివరాలు అడిగారు.తనకు ఘనస్వాగతం పలికినందుకు ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.జిల్లా కలెక్టర్ పి.రాజుబాబు,జిల్లా ఎస్పీ జాషువా ఇతరఅధికారులు అమిత్‌షాకు స్వాగతం పలికారు.భారతీయ జనతాపార్టీ రాష్ట్ర నాయకులు అమిత్‌షాకు స్వాగతం తెలిపారు.అమిత్‌షా తెలంగాణా పర్యటన నిమిత్తం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానం విజయవాడ ఎయిర్‌పోర్టుకు వచ్చారు.ఈ సందర్భంగా కొద్ది నిమిషాలు మాత్రమే స్థానిక బిజెపి నాయకులతో మాట్లాడారు.అనంతరం అమిత్‌షా ప్రత్యేకంగా సిద్ధం చేసిన హెలికాప్టర్‌లో ఖమ్మం బయలుదేరి వెళ్ళారు.తెలంగాణా ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బిజెపి అది నాయకత్వం ఆ రాష్ట్రంపై దృష్టి పెట్టింది.

## జగ్గయ్యపేటలో పోలీసుల నాకబంది 13 మోటార్‌సైకిళ్లు 2 ఆటోలు స్వాధీనం

**జగ్గయ్యపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో పోలీసులు నాకబంది కార్యక్రమం చేపట్టి నిబంధనలు పాటించని 13 మోటార్‌సైకిళ్ళు, 2 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్ఐ బి వెంకటరామరావు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ ఇన్‌ఛార్జి సిటి కమిషనర్ జివిజి అశోక్‌కుమార్ ఏలూరు రేంజ్ డిఐజి ఆదేశాలతో డిసిపి వి అజిత, నందిగామ ఏసిపి జనార్ధననాయుడు, జగ్గయ్యపేట సిఐ ఎం జానకిరామ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి గం.11ల నుండి గం.1ల వరకు నాగా బంది నిర్వహించారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద వాహనాలు తనిఖీచేశారు. రికార్డులు లేకుండా తిరుగుతున్న 13 మోటార్ సైకిళ్ళు, రెండు ఆటోలు సీజ్‌చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు.



## గోపురాలు,గేట్ల వద్ద ఇఒ ఆకస్మిక తనిఖీలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారీ వ్యవస్థ కట్టడికి ఆలయ ఇఒ కె వి సాగర్‌బాబు ఆదివారం దృష్టి సారించారు.గోపురాల ప్రవేశం, గేట్లు వద్ద, పార్కింగ్ వద్ద ఆకస్మిక తనికీలతో దళారీ వ్యవస్థను కట్టడి చేయటానికి చర్యలు తీసుకుంటున్నారు.అయితే ఆలయం పిఆర్ఓ కార్యాలయం వద్ద ఉన్న వారంతా ఎపిఆర్ఓలే అందరూ రాజకీయ నాయకుల సిఫార్సులతో మనుగడ సాగిస్తున్న వారే.మరి ఇఒ ఎవరి మీద చర్యలు తీసుకుంటారు? ఇది సాధ్యమా?గేట్లు వద్ద ఎవరైనా దళారిని ఆపితే ఇక ఆ ఉద్యోగి పని అయిపోతుంది. ఆలయంలో పరిపాలనపై పట్టుకు ఇఒ సాగర్‌బాబు ప్రయత్నిస్తున్నారు.

**దళారుల కట్టడికి పరిశీలనలు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత కొంత కాలంగా దళారీ వ్యవస్థ వేళ్ళు నాటుకుంది.అడుగడుగునా ఎవరు దళారులు ఎవరు దేవస్థానం సిబ్బంది అని పరిశీలించుకుంటున్నారు. ఆలయంలో దళారుల కట్టడికి ఆలయాధికారులు ప్రయత్నిస్తున్నా రాజకీయ జోక్యంతో సాధ్యం కావటం లేదు. ఆలయం అంతా ఎవరో ఒకరాజకీయ నాయకుని సిఫార్సుతో ఇక్కడ ఎపిఆర్ఓలు కొనసాగుతున్నారు. గత వారం రోజులుగా ఆలయ ఇఒ సాగర్‌బాబు పరిపాలనపై పూర్తి స్థాయిలో దృష్టిసారించారు.దాంతో పరిశీలకులు, సిబ్బందిలో ఏమిటీ ఈఓ తీరులో ఈ మార్పు అంటూ చర్చించుకుంటున్నారు. సాగర్‌బాబు ఆర్‌జెసి. ఆయనకు తెలియని నిబంధనలుకాదు.కానీఇక్కడ రాజకీయ చట్రంలో పరిపాలన సాగుతుంది. కాబట్టి చట్టాలు తెలిసినా ఆమలుచేయలేని దుస్థితి చోటు చేసుకుంది, అయితే గుడ్డిలోమెల్ల అన్నట్లు ఇఒ ఆకస్మిక తనిఖీలు పరిశీలనలతో కొంత వరకు చెక్ పెట్టినట్లుంటుంది.



గోవా గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్

## కేరళ యొక్క ఘన సంస్కృతి వారసత్వమే ఓనం పండుగ

### గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లై

**శ్రీసత్యసాయి జిల్లా, ఆగస్టు 27, ప్రభాతవార్త ప్రతినిధి:** కేరళీయుల ఘనమైన సంస్కృతికి వారసత్వ పండుగ 10రోజుల పాటు సాగే ఓనం వేడుకలని గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్‌పిళ్ళై పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నిర్వహించిన ఓనం వేడుకల్లో గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్ళై, ఆయన సతీమణి రీతా శ్రీధరన్‌తో పాటు పాల్గొన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని చిక్కబళ్ళాపూర నుండి రోడ్డు మార్గం గుండా ఆదివారం మధ్యాహ్నం 03:50 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకున్న గవర్నర్ దంపతులకు స్థానిక ఎస్పి ఎస్.వి.మాధవ రెడ్డి, ఆర్‌డిఓ భాగ్యరేఖ, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. శాంతిభవన్ అతిథి గృహంలో బస చేసిన ఆయన అనంతరం సాయికుల్వంత్ సభామండంలో జరిగిన కేరళీయుల సంవత్సరాది ఓనం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో గవర్నర్ మాట్లాడుతూ, సేవ అనే రెండు అక్షరాలలోనే అనంతమైన శక్తి ఇమిడి ఉందని, భగవాన్ సత్యసాయి బాబా సేవలు విశ్వవ్యాప్తంగా అమలౌతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరినీ ప్రేమించాలి,సమాజంలో గౌరవంగా బ్రతకాలని తెలిపారు. మళయాళీల కాలగణనలో మొదనెల అయిన ఓనం ప్రతియేటా ఆగస్టు, సెప్టెంబర్ నెలల మధ్యవస్తుందని, ఇది కేరళ వరికోత పండుగ అని, వర్షపు పువ్వుల పండుగ, పాతలము నుండి మావిళ్ళ రాజు యొక్క వార్షిక ఆగమనాన్ని పురస్కరించుకొని ఈ వేడుకలను నిర్వహించుకుంటారని తెలియ జేశారు. అనంతరం గవర్నర్ సత్యసాయి బాబా మహా సమాధిని దర్శించుకున్నారు.

